పల్లెకు చేరువైన ఆధునిక వైద్యం

- ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన వైద్య సేవలు
- అందుబాటులో రూ.10 లక్షల విలువైన యంత్రాలు
- 64 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు
- బీపీ, షుగర్ మందులతో పాటు అందుబాటులో 160 రకాల ఔషధాలు



మొలగవల్లి పీహెచ్‌సీలో రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్



మొలగవల్లిలో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనం

ఆలూరు రూరల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ వైద్యశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రైవేటు వైద్యశాలలకు దీటుగా ఆధునిక వైద్య పరికరాలతో పాటు క్లినికల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు తగినంత మంది వైద్య సిబ్బందిని నియమించారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచడంతో పాటు మౌలిక వసతులు కల్పించారు. ఏడాది క్రితం మండలంలోని మొలగవల్లిలో రూ.1.78 కోట్లతో నూతన పీహెచ్‌సీ భవనం నిర్మించారు. పీహెచ్‌సీలలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసేందుకు రూ.10 లక్షల విలువైన అత్యాధునిక పరికరాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఫలితంగా గతంలో ప్రభుత్వ వైద్యశాలలకు వెళ్లాలంటే వెనుకాడే ప్రజలు ఇప్పుడు మెరుగైన వైద్యం ఉచితంగానే అందుతుండడంతో భరోసాతో వెళ్తున్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత

ప్రతి రోజు ఆశా కార్యకర్తలు తమకు కేటాయించిన ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని పీహెచ్‌సీల దృష్టికి తీసుకొస్తారు. డాక్టర్ సూచించిన మందులను ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంల సహాయంతో వారి ఇంటికి వెళ్లి పంపిణీ చేస్తారు. దీనికి తోడు ప్రతి నెలా ఆ వార్డు, గ్రామ సచివాలయానికి 104 వాహనంలో వైద్యులు వెళ్లి వైద్య పరీక్షలు చేస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల లక్షణాలు ఉంటే సంబంధిత ఆస్పత్రికి రెఫర్ చేస్తారు. అక్కడ రోగికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి వైద్యులు మందులను పంపిణీ చేస్తున్నారు.

అందుబాటులో 160 రకాల మందులు

ప్రతి పీహెచ్‌సీల్లో కుక్కకాటు ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయి. నియోజవర్గంలోని 11 పీహెచ్‌సీల్లో ప్రతి నెలా 5 నుంచి 6 కుక్కకాటు యాంటీ రాబిస్ ఇంజెక్షన్లు వేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. అలాగే పాముకాటుకు యాంటీ స్నేక్ మందులు అందుబాటులో ఉంచారు. అంతే కాకుండా ప్రజలకు అవసరమైన బీపీ, షుగర్, గ్యాస్ట్రబుల్ తదితర వ్యాధులకు సంబంధించి 160 రకాల మందులు అందుబాటులో ఉంచారు. అలాగే ప్రతి నెలా 9వ తేదీ గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు చేస్తున్నారు. రక్తహీనత, పౌష్టికాహారం లోపం ఉన్న గర్భిణులను గుర్తించి వారికి ఐరన్ మాత్రలు అందిస్తున్నారు. రక్తం అవసరమైన వారికి స్థానిక ఆలూరు సీహెచ్‌సీలో అవసరమైన గ్రూపు రక్తం ఎక్కించే వెసలుబాటు కల్పిస్తున్నారు.

ఆధునిక పరికరాలతో 64 రకాల వైద్య పరీక్షలు

ప్రైమరీ హెల్త్ సెంటర్లలో ఆధునిక వైద్య పరికరాలతో పరీక్షలు చేసేందుకు లేబొరేటరీలను ఏర్పాటు చేశారు. ఈ లేబొరోటరీల్లో రోగ నిర్ధారణకు అవసరమైన 64 రకాల పరీక్షలు చేస్తున్నారు. సీబీపీ, ఎల్ఎఫ్‌టీ (లివర్ పరీక్ష), ఆర్ఎఫ్‌టీ (కిడ్నీ పరీక్ష), లిపిడ్ ప్రొఫైల్ (గుండె జబ్బుల) పరీక్షలతో పాటు షుగర్, బీపీ, హైపటైటిస్, మలేరియా, డెంగీ, టైఫాయిడ్, ప్రెగ్నెన్సీ పరీక్షలు చేస్తున్నారు. ప్రైవేటు లేబోరేటరీల్లో సుమారు రూ.4 వేలకు పైగా ఫీజు వసూలు చేసే పరీక్షలన్నీ ఇక్కడ పూర్తిగా ఉచితంగా చేస్తుండడంతో రోగులకు ఆర్థిక భారం లేకుండా పోయింది.



పీహెచ్‌సీలో ఆధునిక పరికరాలను పరిశీలిస్తున్న డాక్టర్ రవి

పీహెచ్‌సీలోనే అన్ని రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు

రాష్ట్ర ప్రభుత్వం పీహెచ్‌సీల్లో ఆధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షల యంత్రాలు అందుబాటులోకి తెచ్చింది. గ్రామీణ ప్రజలకు ఇబ్బంది లేకుండా వారి సమీపంలోని వైద్యశాలలో 64 రకాల వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చు. మొలగవల్లి పీహెచ్‌సీ కేంద్రంలో ప్రతి రోజు 30 నుంచి 40 మంది రోగులకు వైద్యం అందిస్తున్నాం. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ రవి, మొలగవల్లి పీహెచ్‌సీ

గ్రామచావిడిని తొలగించొద్దు

మద్దికెర: స్థానిక ప్రధాన బజారులో ఉన్న గ్రామ చావిడిని పంచాయతీ వారు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని వీఆర్ఏల సంఘం మండలాధ్యక్షుడు సుంకన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా రెవెన్యూ అధికారుల అధీనంలో ఉన్న గ్రామ చావిడిని పంచాయతీ వారు తొలగించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని చూస్తున్నారన్నారు. రెవెన్యూ అవసరాల కోసం ఉపయోగపడిన గ్రామ చావిడిని తొలగించడాన్ని వీఆర్ఏలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు గ్రామ చావిడిని తొలగించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సుంకన్న, కోదండ, ఆనంద్, రాము, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలో బోయ పెద్దయ్య అనే వ్యక్తి మృతి చెందడంతో ఆ కుటుంబానికి వైఎస్సార్ బీమా మంజూరైంది. ఈ మేరకు గ్రామ కార్యదర్శి సుధాకర్, ఎంపీటీసీ జ్యోతిలత శుక్రవారం మృతుడి భార్య మహాలక్ష్మికి తక్షణ సాయం కింద రూ.10 వేలను అందజేశారు. మిగతా సొమ్ము త్వరలో నామినీ బ్యాంకు ఖాతాలో జమ అవుతుందని చెప్పారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

వెల్దుర్తి(కృష్ణగిరి): చలికాలం దృష్ట్యా పట్టణంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న వారు, నిరుపేదలకు స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు శుక్రవారం దుప్పట్లు ఉచితంగా పంపిణీ చేశారు. నిస్సహాయులను, పేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా ముందుకు రావాలని ఆయన కోరారు. బుడగ జంగాల సంఘం అధ్యక్షుడు విబూధి బాలు, మద్దిలేటి, వలంటీర్ గోపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెడు అలవాట్లకు బానిస కావొద్దు



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ దామోదరం

ఆస్పరి: చిన్నతనంలో చెడు అలవాట్లకు బానిస కావద్దని జన విజ్ఞాన వేదిక జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ దామోదరం విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పుటకలమర్రి వద్ద ఉన్న మోడల్ స్కూల్లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాల భారీ నుంచి యువతను కాపాడుదాం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదరం, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమీల, సీపీఐ నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి మాట్లాడుతూ చిన్నతనంలోనే మత్తుకు బానిసైతే చదువుకు దూరమై బంగారు భవిష్యత్‌ను పోగొట్టుకుంటారన్నారు. చెడు స్నేహం చేయకుండా చదువుపై దృష్టి పెట్టి తల్లిదండ్రులు, పాఠశాల పేరు నిలబెట్టాలన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు రమేష్, ఈశ్వర్, లక్ష్మన్న, రంగప్ప, రఘు, రంగన్న యువరాజు పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ఏర్పాటుకు విరాళం



రూ.లక్ష విరాళం అందిస్తున్న కేవీ సుబ్బారెడ్డి

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పట్టణ పరిధిలోని హైవే-44 పక్కన నిర్మితమౌతున్న 51 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం, ఆలయానికి విద్యావేత్త, రెడ్‌క్రాస్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలులోని తన స్వగృహంలో విగ్రహ నిర్మాణకర్త కె.రామాంజనేయులుకు చెక్కును అందించారు. దాత మాట్లాడుతూ ధర్మ పరిరక్షణకు, ప్రజలకు మంచి జరిగే కార్యక్రమాలకు తన వంతు సహకారం ఉంటుందన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా ట్రెజరర్ జులకంటి రఘునాథ్ రెడ్డి, హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

నాటుసారా ధ్వంసం



నాటుసారా ధ్వంసం చేస్తున్న డోన్ డీఎస్పీ, సీఐ తదితరులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని 8 కేసులలో పట్టుబడ్డ 288 లీటర్ల నాటుసారాను శుక్రవారం పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. సీఐ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో సీఐ సురేశ్‌కుమార్ రెడ్డి, ఏఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



ఎల్లార్తిలో భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: ఎల్లార్తి కన్నడ పాఠశాల నుంచి కోళి రామలింగమ్మ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ కురువ చాముండేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ రోడ్డులో రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో సమస్యను సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఆయన ఆదేశాలతో సచివాలయ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ మేరకు గ్రామస్తులు మంత్రి గుమ్మనూరు జయరాం కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు ఈరన్న, రుద్రయ్యస్వామి, శంక్రప్ప, పంపా, శ్రీనివాసరెడ్డి, దుర్గప్ప, శేషి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతో అందరికీ సమన్యాయం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు లింగప్ప

హాలహర్వి: సీఎం జగనన్న ప్రభుత్వం అందరికీ న్యాయం చేస్తుందని జెడ్పీటీసీ లింగప్ప పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పిల్లలకు ఎన్నో పథకాలు ఇచ్చిన సీఎం జగనన్న అంగన్‌వాడీల సంక్షేమానికి కూడా కృషి చేస్తారని చెప్పారు. వారి డిమాండ్లను పరిష్కరించేందుకు సీఎం త్వర లోనే ఒక నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. మండల కన్వీనర్ భీమప్పచౌదరి, రాజశేఖర్, నాగేంద్ర, శ్రీనివాసులు, లక్ష్మన్న ఉన్నారు.

విద్యాభివృద్ధిపై విషపు రాతలా?

- ఎల్లో మీడియాపై ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను పంపిణీ చేస్తే ఈనాడు పత్రికలో రామోజీరావు విషపురాతలు రాయడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం సాయంత్రం తన నివాసంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నతంగా రాణించాలంటే డిజిటల్ బోధన తప్పనిసరిగా మారిందన్నారు. ఇతర రాష్ట్రాల్లో, దేశాల్లో ట్యాబ్‌లతో విద్యాబోధన సాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో మంజూరు చేసిన ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు పక్కదోవ పడుతున్నారని తప్పుడు రాతలు రాయడం సరికాదన్నారు. విద్యా సంబంధిత విషయాలు మాత్రమే ట్యాబ్‌లో చూసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వ బడుల పిల్లలు సాంకేతికతను అందిపుచ్చుకుని ఉత్తమంగా రాణిస్తుంటే విషపు రాతలతో తల్లిదండ్రుల్లో విషాన్ని నింపేందుకు రామోజీరావు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి రాతలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పాల్గొన్నారు.

యథావిధిగా అంగన్‌వాడీ కేంద్రాల సేవలు



వెల్దుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో స్టాకు వివరాలు నమోదు చేసుకుంటున్న దృశ్యం

కృష్ణగిరి: వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల సేవలు యథావిధిగా కొనసాగుతాయని ఐసీడీఎస్ సీడీపీఓ లూక్ తెలిపారు. రెండు రోజులుగా అంగన్‌వాడీ సిబ్బంది తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ కేంద్రాలను మూసివేసి మండల కార్యాలయాల వద్ద నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. దీంతో కేంద్రాల్లోని ఆహార నిల్వలు, రాబోవు స్టాకు వ్యర్థమయ్యే అవకాశాలున్నట్లు గుర్తించిన ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం వెల్దుర్తిలోని 63, కృష్ణగిరిలోని 46 కేంద్రాలను తెరిపించారు. ఆయా మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో కేంద్రాల తాళాలను పగులగొట్టి, అందులోని స్టాకును పంచనామా చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. కేంద్రాల నిర్వహణను సచివాలయ మహిళా పోలీసులకు అప్పగించారు. ఇకపై రోజూ మాదిరిగాగే ఎమ్ఎస్‌కేల ఆధ్వర్యంలో కేంద్రాల ద్వారా సంపూర్ణ పోషణ కిట్లు లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. తహసీల్దార్లు శివరాముడు, రాజేశ్వరి, ఎంపీడీఓలు శ్రీనివాసరావు, రామస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ముగిసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు

కృష్ణగిరి: ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ మురళీమోహన్ సూచించారు. మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి, ఆలంకొండ గ్రామాల్లో శుక్రవారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు గిరిబాబు, షహనాజ్‌బేగం ఆధ్వర్యంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల్లో వారం రోజులుగా జరిగిన యాత్రలు ముగిశాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉజ్వల యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి బీమా యోజన, తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానికులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. వైద్యాధికారి వరప్రసాద్, ఏఈఓ రాజేష్, టీఏ శేషిరెడ్డి, నాయకులు రామలింగం, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘననివాళి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఆంధ్రరాష్ట్ర అవతరణకు ఆమరణ నిరాహార దీక్ష చేసి తనువు చాలించిన త్యాగమూర్తి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని శుక్రవారం స్థానిక బ్రహ్మేశ్వర పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో స్మృతి కార్యక్రమం నిర్వహించారు. పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు శంకరయ్య మాస్టారు ఆధ్వర్యంలో అమరజీవి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ధ్యానం గురించి వివరించారు. జూనియర్ కాలేజీ అభివృద్ధి కమిటీ ప్రతినిధి తిరివీధి కిశోర్, ఆనంద్‌కుమార్, జనార్ధనశెట్టి పాల్గొన్నారు.

ఫీజులు రద్దు చేయాలి

దేవనకొండ: కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేసి, తక్షణమే ప్రత్యేక కరువు స్కాలర్‌షిప్ ద్వారా రూ.15 వేలు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్ఐ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు.

పేద విద్యార్థులకు మేలు చేస్తే ఓర్వలేరా?



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండటౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తే ఓర్వలేని రామోజీరావు తన ఎల్లో పత్రికలో విషప్రచారం చేయడం సిగ్గుచేటు అని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ధ్వజమెత్తారు. శుక్రవారం సాయంత్రం తుగ్గలి మండలం మారెళ్ల గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. పేదల చదువుపై విషం చిమ్ముతూ ఈనాడు పత్రికలో ట్యాబ్‌లు, బైజూస్ కంటెంట్‌పై ప్రచురించిన వార్తలను తీవ్రంగా ఖండించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులకు దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయన్నారు. ఏదో రకంగా చంద్రబాబును అందలం ఎక్కించాలనే ఉబలాటంతో రామోజీరావు జర్నలిజం ముసుగులో ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని పథకాలపై తప్పుడు రాతలు రాస్తూ విషప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, టోఫెల్ శిక్షణ అమలు చేసినప్పుడు కూడా ఇదే విధంగా తప్పుడు వార్తలు ప్రచురించారని గుర్తుచేశారు. రామోజీ, చంద్రబాబు మనవళ్లు, పవన్‌కళ్యాణ్ పిల్లలు ట్యాబ్‌లు లేకుండా చదువుకుంటున్నారా? ఇంగ్లిష్ మీడియం చదవడం లేదా అని ప్రశ్నించారు. తప్పుడు రాతలు రాస్తున్న కుల దురహంకారి రామోజీరావు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. విషప్రచారం చేస్తున్న పెత్తందారులకు బడుగు, బలహీన వర్గాల ప్రజలే తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ జిట్టానాగేశ్, నాయకులు హనుమంతు, అట్లా గోపాల్‌రెడ్డి, సర్పంచ్ సుగుణమ్మ, ఎంపీటీసీ రసూల్‌బీ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ రాఘవేంద్రప్రసాద్ తెలిపారు. విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా కలిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ట్రాక్టర్ బోల్తా

పత్తికొండ రూరల్: పత్తికొండ తేరుబజారులో శుక్రవారం తెల్లవారుజామున బండల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. బేతంచర్ల నుంచి కర్ణాటకకు వెళ్తుండగా మార్గమధ్యలో తేరుబజారు ప్రాంతంలో ట్రాక్టర్ టైరు ఊడిపోయి ప్రమాదం జరిగింది. ట్రాక్టర్‌లో బండతో పాటు వాటిపై కూర్చున్న కూలీలు కింద పడ్డారు. ప్రాణాపాయం ఏమీ లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. తెల్లవారుజాము నుంచి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో ఎస్ఐ వెంకటేశ్వర్లు అక్కడికి చేరుకుని వ్యవసాయ మార్కెట్‌యార్డు నుంచి బైపాస్ మీదుగా బస్సులు, ఇతర వాహనాలను మళ్లించేలా చర్యలు తీసుకున్నారు. తరువాత వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

జగనన్నతోనే రాష్ట్రం సుభిక్షం

కృష్ణగిరి: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా మళ్లీ కొనసాగాలని సచివాలయ కన్వీనర్లు అనంత రెడ్డి, జనార్దన్ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి, చుంచుఎర్రగుడి గ్రామాల్లో శుక్రవారం వారు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాల ద్వారా ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు లబ్ధి చేకూరిందని వివరించారు. ఇలాంటి సంక్షేమ పథకాలు మరిన్ని అందాలంటే జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రీసర్వే గడువు పొడిగించాలి

హొళగుంద: గజ్జహళ్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీసర్వే గడువును పొడిగించాలని రైతులు కోరుతున్నారు. గ్రామంలో వరి కోతలు, బెంగళూరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు రీసర్వే చేయించుకోలేకపోయారని చెప్పారు. అదేవిధంగా భూములు, యజమానులు, విస్తీర్ణం తదితర విషయాలకు సంబంధించి ఆన్‌లైన్ అడంగల్‌లో తప్పుగా నమోదయ్యాయని వాటిని సరిచేయాలని అధికారులను కోరితే గడువు తీరిందని చెబుతున్నారని వాపోయారు. ఇలాంటి సమస్యలు గ్రామంలో చాలా ఉన్నాయని గడువు లేదనడంతో తమకు ఏమి తోచడం లేదని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి గతంలో జరిగిన తప్పులను సరి చేసుకోవడానికి రీసర్వే గడువు పొడిగించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన



మారెళ్లలో హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన అందుతోందని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మారెళ్లలో రూ.38.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.17.50 లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్‌ను శుక్రవారం గ్రామ సర్పంచ్ సుగుణమ్మతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వ శాఖల సేవలన్నీ ఒకే చోట అందుబాటులో ఉంచడం ద్వారా సీఎం వైఎస్ జగనన్న పరిపాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ నాయకులు అధికారం కోసం మోసపూరిత మాటలు చెప్పేందుకు వస్తున్నారని ప్రజల వారి మాటలు నమ్మవద్దన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని, లబ్ధిదారులందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలపాలని కోరారు. అనంతరం స్థల దాత రాజశేఖర్‌రెడ్డిని అభినందించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జిట్టా నాగేష్, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్దన్ రెడ్డి, లింగన్న, మోహన్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, రాశులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నేడు బురుజులకు ఎమ్మెల్యే రాక

మద్దికెర: మండల పరిధిలోని బురుజుల గ్రామానికి ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి శనివారం వస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంపల వెంకటేశ్వర్లు, నాయకులు జయభరత్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు గ్రామంలో నూతనంగా రూ.20.84 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో బీసీ కాలనీలో రూ.20 లక్షలతో వేసిన సీసీ రోడ్లను ప్రారంభిస్తారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, సర్పంచులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొనాలన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సభ్యుల నియామకం

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీలను నియమిస్తూ పార్టీ అధిష్టానం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. పార్టీ బీసీ సెల్‌లో ప్రధాన కార్యదర్శిగా వి.కృష్ణమూర్తి, కార్యదర్శులుగా సి.నరేష్, వి.వీరేష్ సహాయ కార్యదర్శులుగా బి.శ్రీనివాసులు,బి.వెంకటేశ్వర్లునునియమించారు.

- జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శిగా కె.రాజరత్నం, కార్యదర్శులుగా ఆర్.బజారి, డి.మద్దిలేటి, సహయకార్యదర్శులుగా ఎస్.శివ, ఎస్.మహాలింగప్ప నియమితులయ్యారు.
- జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా బీకె.భవాని, కార్యదర్శులుగా జి.మల్లమ్మ, కె.రత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా వి.గౌరమ్మ, కె.సునిత
- జిల్లా మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడిగా రసూల్, ప్రధాన కార్యదర్శిగా వాహిద్, కార్యదర్శులుగా హుసేన్, సహాయ కార్యదర్శులుగా లీష, డీఎంఎస్ రవూఫ్,
- జిల్లా పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శిగా బోయ బజారి, కార్యదర్శులుగా పెద్దమారెప్ప, శివకుమార్, సహయకార్యదర్శులుగా పి.కేశవరెడ్డి, అమోస్
- జిల్లా పబ్లిసిటీవిభాగంప్రధాన కార్యదర్శిగా మన్సూర్‌బాష ,కార్యదర్శులుగా మనోహర్‌రెడ్డి, చాంద్ బాష, సహాయ కార్యదర్శులుగా ఎస్.మహమ్మద్, చాంద్
- జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులుగా ఆర్.వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అంపయ్య, కార్యదర్శులుగా కె.నాగభూషన్‌రెడ్డి, కేఎస్ అహమ్మద్, సహాయ కార్యదర్శులుగా బి.గంగాధర్, సురేష్‌గౌడ్
- జిల్లా ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎం.రంగన్న, కార్యదర్శులుగా ఎస్.దాస్, ఎం.రాజు, సహాయకార్యదర్శులుగా బజారి, ఎం.ప్రభాకర్
- జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శులుగా బి.సుంకన్న, కార్యదర్శులుగా గౌరీశంకర్, శివ దేవ్, సహాయ కార్యదర్శులుగా రాముడు, ఈశ్వర్‌నాయక్
- జిల్లా విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎండీ షరీఫ్, కార్యదర్శులుగా శ్రీరాములు, ప్రకాష్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా సోమశేఖర్, అబ్దుల్లా
- జిల్లా వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడి బంగిశ్రీరాం, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శులుగా కె.పద్మనాభం, బి.ఉస్మాన్, సహాయకార్యదర్శులుగా యుయు.నాగేష్, ఎస్.శ్రీనివాసరెడ్డి
- జిల్లా వికలాంగుల విభాగం ప్రధాన కార్యదర్శిగా కె.విజయలక్ష్మి, కార్యదర్శులుగా కె.హనుమంతు, ఇ.లింగన్న, సహాయకార్యదర్శులుగా ఎస్.మహాలక్ష్మి, రఘువీర్
- జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడిగా బుట్టారంగయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.గోవిందు, కార్యదర్శులుగా కె.శ్రీనివాసులు, కె.నర్సప్ప, సహాయ కార్యదర్శులుగా జి.శ్రీను,ఎం.శివ
- జిల్లా యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా శివభూషన్‌రెడ్డి, కార్యదర్శులుగా నరేష్‌రెడ్డి, జి.శ్రీనివాసులు, సహాయకార్యదర్శులుగా రామ్‌గోపాల్, కె.ఉదయ్
- జిల్లా వైఎస్సార్ సేవాదళ్ విభాగం ప్రధాన కార్యదర్శులుగా బి.రఘు, కార్యదర్శులుగా బి.రఫీక్, రంగన్న, సహాయకార్యదర్శులుగా బాష, అబ్దుల్‌రజాక్,
- జిల్లా వైఎస్సార్‌టీయూసీ విభాగం ప్రధాన కార్యదర్శిగా బి.బజారి, కార్యదర్శులుగా కె.నాగరాజు, బి.శ్రీనివాసులు సహాయ కార్యదర్శులుగా బి.సోమేష్, బి.రంగయ్యలను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

క్రీడాకారుల వివరాలు నమోదు చేయండి

ఎమ్మిగనూరురూరల్: ఆడుదాం– ఆంధ్ర పోటీలకు క్రీడాకారుల వివరాలు నమోదు చేయాలని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల పేర్ల నమోదుకు ఈ నెల 17వ తేదీ వరకు అవకాశం ఉందని చెప్పారు. ఈ నెల 26 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. ఎంపీడీవో బంగారమ్మ, ఈఓఆర్డీ విజయలక్ష్మి, ఎంఈఓ ఆంజనేయులు, పీడీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో సీజనల్ వ్యాధుల నివారణ

ఆలూరు రూరల్: ముందు జాగ్రత్తలు పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులను నివారించవచ్చని మొలగవలి పీహెచ్‌సీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆలూరులోని సచివాలయం -4 పరిధిలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి వ్యాధుల నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో, ఇంట్లో ఎక్కువ రోజులు నీళ్లు నిల్వ ఉంచుకోరాదన్నారు. పాత కొబ్బరి చిప్పలు, టైర్లు, పాడైన డ్రమ్ములలో నీరు ఉంచరాదని దీని ద్వారా దోమల లార్వా వృద్ధి చెందుతుందన్నారు. జ్వరం, దగ్గు వంటి లక్షణాలు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలన్నారు.